
సాక్షి
బాపట్ల
మంగళవారం । 2 । జనవరి । 2024



భక్తులతో విజయకీలాద్రి కిటకిట

తాడేపల్లి రూరల్ : సీతానగరం విజయకీలాద్రి దేవస్థానం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరంలో స్వామిని దర్శించుకునేందుకు అధికంగా వచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 522.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో సీఎస్

ఇంద్రకీలాద్రి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి దంపతులు సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్పందన అర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దు

అధికారులకు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశం



గుంటూరు వెస్ట్: స్పందన అర్జీల్ని ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందే విధంగా పూర్తి స్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులకు చెప్పారు. కోర్టు సంబంధిత అంశాల్ని న్యాయస్థానాల్లోనే పరిష్కరించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం వచ్చిన 62 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా అధికారులు పరిశీలించారు.

ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఫైనల్ మెరిట్ లిస్టు సోమవారం విడుదల చేశారు. లిస్టులో క్లరికల్, టైపోగ్రాఫికల్ తప్పిదాలు ఏమైనా ఉంటే ఈనెల 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలని డీఎంహెచ్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్, రూరల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం చేశామని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన ఫైనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలియజేశారు.

హైకోర్టు అధీకృత క్యాలెండర్ ఆవిష్కరణ



నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు అధీకృత నూతన క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు దినాలు, న్యాయస్థానాల సెలవు దినాలు, పని దినాల వివరాలు క్యాలెండర్‌లో పొందుపరచడం ద్వారా న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, గుమస్తాలకు, కోర్టు సిబ్బందికి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా జడ్జి రాజగోపాల్‌రావు, 3వ అదనపు జిల్లా జడ్జి అర్చన, 4వ అదనపు జిల్లా జడ్జి శరత్‌బాబు, 5వ అదనపు జిల్లా జడ్జి నీలిమ, పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సీతారామకృష్ణారావు, గవర్నమెంట్ ప్లీడర్ వెంకటేశ్వర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజశేఖర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: నూతన సంవత్సరం పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టి సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, మహిళ విభాగం జిల్లా చైర్‌పర్సన్ ఎం.రాధారాణి, నగర అధ్యక్షుడు సూరి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2200, గరిష్ట ధర రూ.3200, మోడల్ ధర రూ.2700 వరకు పలికింది.







కలెక్టర్ రంజిత్ బాషాకు బొకే అందజేస్తున్న డ్వామా పీడీ అర్జునరావు,డీఎల్‌పీవో సువార్త | గుంటూరులో కేక్ కట్ చేస్తున్న ఐజీ పాలరాజు, చిత్రంలో ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీలు | ఐజీని సత్కరిస్తున్న రేంజ్ పరిధిలోని పోలీస్ అధికారులు

గ్రాండ్ వెల్‌కమ్

నిండు పున్నమి వెన్నెల మిలమిలా మెరిసినట్టు.. తారలన్నీ తారాజువ్వలై మిరుమిట్లుగొలిపినట్టు.. నవ్వులే కొత్త ఉషస్సులై కాంతులీనినట్టు.. నాట్యరీతులన్నీ సప్తస్వరాలతో జతకట్టి నర్తించినట్టు.. కొత్త సంవత్సర ఉత్సాహం అంబరాన్నంటింది. ఊరూవాడా సంబరమై మురిసింది. శుభాకాంక్షల వెల్లువలో ఉమ్మడి గుంటూరు జిల్లా తడిసిముద్దయింది. కేకుల కేరింతలతోపాటు పుష్పమాలికల సోయగాలు నవోదయానికి ఆహ్వానం పలికాయి. ఆలయాల్లో ఆధ్యాత్మికోత్సహం పరవళ్లుతొక్కింది. – సాక్షినెట్‌వర్క్

ప్రజా బలం లేకే టీడీపీ దాడి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి, పశ్చిమ సమన్వయకర్త విడదల రజిని





దాడి గురించి వివరిస్తున్న మంత్రి రజని, ఎమ్మెల్యే గిరి (ఇన్‌సెట్‌లో) టీడీపీ, జనసేన కార్యకర్తలు విసిరిన రాళ్లు

నెహ్రూనగర్: తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో ప్రజా బలం లేదని, ఆ విషయం తెలిసే దాడులకు తెగబడుతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని ధ్వజమెత్తారు. గుంటూరులోని కొరిటెపాడు రోడ్డు చంద్రమౌళీ నగర్ ప్రధాన రహదారిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫాలతో కలసి ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బీసీ మహిళ రాజకీయాలు చేయడం టీడీపీ పెత్తందారులకు ఇష్టం లేదని, అందుకే తనను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులమంతా కలసికట్టుగా టీడీపీ దౌర్జన్యాల్ని ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు టీడీపీలో ఉన్నారని, వారే ఇలాంటి దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, జగనన్న ఆశీస్సులతో ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు పేరుతో టీడీపీ గూండాలు నూతన కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. గుంటూరు నగర ప్రజలు శాంతిని కోరుకుంటారని, క్రమశిక్షణతో ఉంటారని, ఇలాంటి దాడుల్ని ఎవరూ స్వాగతించరని పేర్కొన్నారు. రౌడీయిజం ద్వారా విధ్వంసాలు చేసేవారికి ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని తెలిపారు. తమ నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కూడా తమకు శాంతి, సహనంగా ఉండాలని మాత్రమే చెప్పారని, దాడులు చేయడం తమ పార్టీ విధానం కాదని మంత్రి పేర్కొన్నారు. గుంటూరు నగర అభివృద్ధే ధ్యేయంగా తాము ముందుకు వెళతామని తెలిపారు. అలజడులు సృష్టించి లబ్ధి పొందాలనే నైజానికి తాము ఎల్లప్పుడూ దూరంగా ఉంటామని మంత్రి వెల్లడించారు. ఓటమి భయంతోనే టీడీపీ అల్లరి మూకలు పార్టీ కార్యాలయం విధ్వంసానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఈ కుట్ర వెనుక ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని, చట్టప్రకారం ముందుకు వెళతామని స్పష్టం చేశారు.



దాడిలో పగిలిన పార్టీ కార్యాలయ భవనం అద్దాలు

సాగర్‌మాత ఆలయంలో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



విజయపురిసౌత్: స్థానిక సాగర్‌మాత ఆలయంలో నూతన సంవత్సర వేడుకలు విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి సందేశమిస్తూ మోసకరం, దుష్టవాంఛలతో కూడిన పాత జీవితాన్ని వదిలి వేయాలన్నారు. ఈ నూతన సంవత్సరంలో దేవుని బిడ్డలు చల్లగా జీవించేలా ఆ తల్లి దీవెనలు ప్రతి ఒక్కరికీ కలగాలని ప్రార్థన చేశారు. ముందుగా ఆలయంలో నూతన సంవత్సర కేక్‌ను చేసి శుభాకాంక్షలు తెలిపారు.దివ్యబలిపూజలో ఫాదర్ జోసఫ్ తంబి, సిస్టర్స్, ఆలయ కమిటీ సభ్యులు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, మాలపాటి మరియదాసు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ

- ఈ ఏడాది ఇంటర్ విద్యార్థుల సంఖ్య పెరిగింది
- కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి సుబ్బారావు



సుబ్బారావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు

అద్దంకి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం 5.30 లక్షలు, ద్వితీయ సంవత్సరం 4.60 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు , ఈ ఏడాది పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి వి. సుబ్బారావు వెల్లడించారు. సోమవారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక ప్రకాశం జూనియర్ కళాశాలలో విలేకర్లతో మాట్లాడారు. ఇంటర్ విద్యార్థుల కోసం ఆయా కళాశాల్లో 40 రోజుల కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కళాశాలల స్థాయిలో రోజుకో సబ్జెక్టుపై పరీక్షలు నిర్వహించే ప్రణాళికను రూపొందించాలని యాజమాన్యానికి సూచనలు ఇచ్చారు. మార్చి 1 నుంచి 18 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 10, 20 తేదీల్లో ప్రయోగ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. మార్చి నెలాఖరుకల్లా మూల్యాంకనం పూర్తి అవుతుందని, 26 జిల్లాల ప్రాతిపదికన పరీక్ష కేంద్రాలు కేటాయింపు జరుగుతుందన్నారు. నామినల్ రోల్ వివరాలను ఆయా కళాశాలల ప్రిన్సిపల్ లాగిన్‌కు పంపామని, విద్యార్థులు వాటిని పరిశీలించి తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ఇప్పటికే అన్ని కళాశాలలో సిలబస్ పూర్తి అయిందని, పరీక్షలు పకడ్బందీగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియ సంక్రాంతి పండగలోపు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్‌జేడీ తెలిపారు. మొత్తం 3750 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉన్నారని, 2014 నాటికి పోస్టుల్లో పనిచేస్తున్న వారి వివరాలు ఇప్పటికే అందాయని వాటిని పరిశీలిస్తామన్నారు. ఆర్‌జేడీని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులతోపాటు, ప్రవేటు కళాశాలల యాజమాన్యాలు కలిసి నూతన సంవత్సన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్. రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో గెలుపు తథ్యం

- వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయటం ఖాయం !
- కులమతాల ప్రసక్తే తేవద్దు
- టీడీపీ అయినా మరేదైనా డోంట్ కేర్
- నూతన సంవత్సర వేడుకల్లో నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి

అద్దంకి: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అద్దంకిలో మార్పు తీసుకువస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని శింగరకొండ రోడ్డులో సోమవారం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని వ్యక్తి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని, ముందుగా చెప్పిన విధంగా అన్ని హామీల్ని ఆయన నెరవేర్చారని చెప్పారు. దానిలో భాగంగా అంచెలంచెలుగా పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతానని చెప్పి నేడు పెంచారని తెలిపారు. ఇలాంటి సీఎంను మరలా మరలా తెచ్చుకోవాలని పిలుపునిచారు. 2024 ఎన్నికలు కీలకమైనవని, 175కు 175 వచ్చే విధంగా కార్యకర్తలు, నాయకులు అహర్నిశలు పని చేయాలని ఆయన తెలిపారు. నాయకులు విభేదాలు వీడి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని చెప్పారు. తన మీద నమ్మకంతో అద్దంకి పంపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వై.వి. సుబ్బారెడ్డికి, ఆదరాభిమానాలు చూపుతున్న అద్దంకి ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. తాను నిరుపేద కుటుంబం నుంచి వచ్చానని, పులివెందుల కళాశాలలో డిప్లొమా చేయడానికి వెళ్లినప్పుడు ఫీజు తక్కువగా ఉంటే వైఎస్సార్‌ను కలిశానన్నారు. ఆయన కాలేజీకి ఫోన్ చేసి తన వద్ద ఉన్న వరకే తీసుకోమని చెప్పారని గుర్తు చేసుకున్నారు. అందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

టీడీపీ పని అయిపోయింది..

అద్దంకిలో గెలిచి సీఎంకు ఎమ్మెల్యే పదవి బహుమతిగా ఇస్తానని హనిమిరెడ్డి అన్నారు. తనకు కులమత ప్రసక్తి లేదన్నారు. అందరం మనుషులమని, వాటిని ఎవరూ తన వద్ద తేవద్దని చెప్పారు. ప్రజలందరికీ అండగా ఉంటానని తెలిపారు. నిత్యం పార్టీ కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరసింహారెడ్డి, ముఖేశ్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేసు పద్మేశ్, కె. అంనత లక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, శింగరకొండ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, జజ్జర ఆనందరావు, జువ్వి రాము, కోట శ్రీనివాసకుమార్, ఐదు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి తదితరులు

యర్రంవారిపాలెం (కారంచేడు): జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, కోఆపరేటివ్, మార్కెటింగ్ రంగ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. ఆయన సోమవారం మండలంలోని యర్రంవారిపాలెంలో గత స్వగృహంలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించి విలేకర్లతో మాట్లాడారు. జగనన్న పాలనలో పేద ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. సంక్షేమమే ధ్యేయంగా చేపట్టిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో లబ్ధి పొందారని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో జగనన్నకే ఓటు అన్నట్లు పేదలు ఎన్నికల కోసం సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జగనన్న పాలనలోనే రాజన్న సంక్షేమ పాలన అందుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘ రాష్ట్ర డైరెక్టర్ కొల్లాటి ఏడుకొండలు, కారంచేడు వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కొడాలి ధర్మానందరావు, షేక్ మీరయ్య, కారంచేడు, చినగంజాం, పర్చూరు, మార్టూరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యార్డులో 48,615 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 48,615 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 43,688 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.14,000 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి 23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 30,917 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి తెలిపారు.

అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం

అయోధ్య నుంచి వచ్చిన రైలు

చీరాల: అయోధ్య నుంచి బెంగళూరు వెళ్లే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సోమవారం చీరాల రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. ప్రధానమంత్రి మోదీ చేతుల మీదగా ప్రారంభించిన రైలు సోమవారం ఉదయం చీరాల రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాగతం పలికారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్రయాణికులకు ఎంతో సుఖవంతంగా ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మువ్వల వెంకటరమణరావు, బండారుపల్లి హేమంత్‌కుమార్, శంకరశెట్టి నాగేశ్వరరావు, అరవపల్లి కుమార్, నాశన మణికుమార్, అరవిందబాబు తదితరులు పాల్గొన్నారు.



భవానీ దీక్షల విరమణకు సన్నద్ధం

- రేపు ఉదయం అగ్నిప్రతిష్టాపన
- 5 లక్షల మంది భవానీలు వస్తారని అంచనా
- 20 లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్న దేవస్థానం
- గిరి ప్రదక్షిణ మార్గంలో మరిన్ని సదుపాయాలు



సిద్ధమైన క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్షల విరమణకు సర్వం సిద్ధమైంది. ఈ నెల ఏడో తేదీ వరకు కొనసాగే దీక్షల విరమణకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, ఒడిశా నుంచి భవానీ మాలధారులు ఇంద్రకీలాద్రికి తరలిరానున్నారు. ఈ ఏడాది సుమారు ఐదు లక్షల మందికి పైగా భవానీలు దీక్షల విరమణకు విచ్చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భవానీల రద్దీకి అనుగుణంగా అమ్మవారి దర్శనంలో వారికి ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు ఆలయ ప్రాంగణంతో పాటు స్నాన ఘాట్లు, తలనీలాలు సమర్పించే కేశఖండన శాలలు, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, అన్న ప్రసాద వితరణ కేంద్రాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచే భవానీలు నగరానికి తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

అగ్నిప్రతిష్టాపనతో దీక్షల విరమణ ప్రారంభం

మూడో తేదీ ఉదయం ఆరు గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం ఆలయం నుంచి అర్చకులతోపాటు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు, పాలక మండలి సభ్యులు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపం దిగువన ఉన్న హోమగుండాల వద్దకు చేరుకుంటారు. మహా మండపం ఎదుట ఏర్పాటు చేసిన రెండు హోమ గుండాల్లో ఉదయం 6.30 గంటలకు అగ్నిప్రతిష్టాపన చేస్తారు.. దీంతో దీక్షల విరమణ లాంఛనంగా ప్రారంభమవుతుంది.

క్లుప్తంగా

జెడ్పీలో కొత్త సంవత్సర వేడుకలు



జెడ్పీ డైరీ ఆవిష్కరిస్తున్న హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్, అనురాధ, మోహన్‌రావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో సోమవారం కొత్త సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కత్తెర సురేష్‌కుమార్ కేక్ కట్ చేశారు. అనంతరం జెడ్పీ డైరీని ఆవిష్కరించారు. కారుణ్య నియామకాల ద్వారా నలుగురికి టైపిస్టులుగా ఉద్యోగాలిస్తూ ఉత్తర్వులు అందజేశారు. తొమ్మిది మంది ఆఫీస్ సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. నాలుగో తరగతి ఉద్యోగులకు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్‌బేగం, ఏవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న టీడీపీ కౌన్సిలర్ అరెస్టు

గురజాల: తెలంగాణ మద్యం తరలిస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన వార్డు కౌన్సిలర్ సీహెచ్ శ్రీనివాసరావును అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) ఎస్‌ఐ ఎం.జయరాం తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దాచేపల్లి మండలంలోని పొందుగుల సరిహద్దు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా టీడీపీ కౌన్సిలర్ సీహెచ్ శ్రీనివాసరావు వాహనంలో 36 బాటిళ్ల మద్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాహనంలో ఓ స్టేషన్‌కు చెందిన ఏఎస్‌ఐతో పాటు కొండలు అనే వ్యక్తి ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కౌన్సిలర్ శ్రీనివాసరావుతో పాటు కొండలును అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి 36 బాటిళ్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏఎస్‌ఐ పరారీలో ఉన్నట్లు చెప్పారు. దాడుల్లో సీఐ ఆర్.వి.రమణమ్మ, ఎస్‌ఐ ఆంజనేయులు ఉన్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని గురజాల సెబ్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు.

పాఠశాలలో ఆకతాయిల వీరంగం

- నాడు–నేడు పనుల సామగ్రి ధ్వంసం
- పూనూరు జడ్పీ హైస్కూల్‌లో ఘటన



పాఠశాలలో తలుపులు ధ్వంసం చేసిన దృశ్యం



నాడు–నేడు ద్వారా నిర్మిస్తున్న వాటర్‌ట్యాప్‌లు విరగ్గొట్టిన ఆకతాయిలు

యద్దనపూడి: ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. మండలంలోని పూనూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం అర్ధరాత్రి కొందరు ఆకతాయిలు విధ్వంసం సృష్టించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు వివరాల మేరకు.. గత కొన్ని రోజులుగా పాఠశాలలో కొందరు దుండగులు రెచ్చిపోతున్నారన్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తరగతుల గదుల తాళాలు, తలుపులు, నాడు–నేడు ద్వారా నిర్మిస్తున్న కుళాయి ట్యాపులు విరగొట్టారు. గమనించిన నైట్ వాచ్‌మెన్ గట్టిగా కేకలు వేయటంతో ఆకతాయులు పారిపోయారు. అలాగే రోడ్డు పక్కన నిలిపి ఉన్న ప్రైవేట్ స్కూల్ బస్సు అద్దాలను కూడా పగులగొట్టారు. ఈ విషయాన్ని వాచ్‌మెన్, ప్రధానోపాధ్యాయులు గ్రామస్తుల దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి ఆవిషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో 2021 మార్చి 12లో కూడా ఇలాగే పాఠశాలలో తలుపులు, బీరువాలు పగలకొట్టి, ట్యాబులు రిజిస్టర్లు ధ్వంసం చేశారు. ఇలా అనేకసార్లు ఆకతాయులు రాత్రి సమయాల్లో పాఠశాల ఆవరణలో మద్యం తాగి సీసాలు పగులకొట్టటంతో పాటు గోడలపై అసభ్యకర రాతలు రాసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగశ్రీను పాఠశాలకు చేరుకొని పరిశీలించారు.

నంబూరులో బీసీలపై టీడీపీ గ్రామ అధ్యక్షుడి దౌర్జన్యం

పెదకాకాని: నంబూరు గ్రామంలో బీసీ కాలనీ వాసులపై టీడీపీ గ్రామ అధ్యక్షుడు మాకిరెడ్డి జయరామిరెడ్డి దౌర్జన్యం చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. యాదవపాలెంకు చెందిన ఆర్ద్రల వెంకటేష్ ఆదివారం రాత్రి సిగరెట్లు తీసుకునేందుకు ఆస్పత్రి సెంటర్‌లో ఉన్న సుబ్బమ్మ కిరాణా షాపు వద్దకు వచ్చాడు. అదే సమయంలో అటు వైపుగా వస్తున్న టీడీపీ గ్రామ అధ్యక్షుడు మాకిరెడ్డి జయరామిరెడ్డి కారు వెంకటేష్ బైక్‌కు తగిలింది. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వెంకటేష్‌పై జయరామిరెడ్డి దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న యాదవపాలెంకు చెందిన యువకులు జయరామిరెడ్డి కారును అడ్డుకున్నారు. దీంతో మద్యంమత్తులో ఉన్న మాకిరెడ్డి జయరామిరెడ్డి యువకులపై దౌర్జన్యానికి దిగారు. రాయలేని విధంగా అసభ్య పదజాలంతో దూషించారు. యాదవపాలెం యువకులు ప్రస్తుతం టీడీపీ పక్షానే ఉన్నారని, మంగళవారం టీడీపీ నాయకులు సమక్షంలో జరిగే చర్చల్లో న్యాయం జరగకపోతే బీసీలు పార్టీ మారే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని బాధిత యువకుడి తండ్రి ప్రభాకర్ తెలిపారు.

గుంటూరు వెస్ట్‌ను బెస్ట్‌గా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, చిత్రంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు గిరి, ముస్తఫా, మేయర్ మనోహర్

నెహ్రూనగర్(గుంటూరు): గుంటూరులోని కొరిటిపాడు రోడ్డు చంద్రమౌళినగర్ ప్రధాన రహదారిలో సోమవారం వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫాలతో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం ప్రజలు తనపై చూపుతున్న ఆదరణకు ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గానికి తనను ఇన్‌చార్జిగా ప్రకటించిన నాటి నుంచి పలు కార్యక్రమాల ద్వారా పార్టీ కార్యకర్తలు, నాయకులకు దగ్గరయ్యే యత్నం చేస్తున్నానని చెప్పారు. పార్టీ శ్రేణులు తనపై చూపుతున్న ప్రేమాభిమానాలు ఎంతో సంతోషాన్నిస్తున్నాయన్నారు. నూతన సంవత్సరం తొలి రోజు సందర్భంగా సోమవారం పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించుకున్నట్లు చెప్పారు. గుంటూరు వెస్ట్ నియోజకవర్గాన్ని బెస్ట్‌గా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. తొలుత ఆమె పార్టీ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు డైమండ్ బాబు, సజిల, గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక ఎడ్ల పందేలు

బోయినవారిపాలెంలో పోలు రాధా రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం



పందెంలో భాగంగా బరువు లాగుతున్న ఎడ్లు

చీరాల టౌన్: పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు ఎడ్ల పందేలు ప్రతీకలని పలువురు నాయకులు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో శ్రీకృష్ణయాదవ్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోలురాధా ఎడ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు చీరాల, పర్చూరు, చినగంజాం, ఎస్ఎన్ పాడు, బాపట్ల, పొన్నూరు, పెదనందిపాడు, ఇంకొల్లు, రేపల్లె తదితర ప్రాంతాలకు చెందిన 25 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలను సీనియర్ పశుపోషకులు ప్రారంభించి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఏటా నూతన సంవత్సరం రోజున పోటీలను నిర్వహించి పల్లెల్లో పండుగ వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు ఎడ్ల పందేలు ప్రతీకలని, పశుపోషకులు అందరూ తమ ఎద్దులతో పోటీల్లో పాల్గొనడం వలన గ్రామాల మధ్య స్నేహబంధాలు ఏర్పడుతున్నాయన్నారు. ఈపోటీలు ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో హోరాహోరీగా జరుగుతున్నాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ.15116, మూడో బహుమతిగా రూ.10,116, నాలుగో బహుమతిగా రూ.7116, ఐదో బహుమతిగా రూ.5,116, ఆరో బహుమతిగా రూ.3,116లను అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఎడ్ల పందేల కారణంగా గ్రామంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులుతో పాటుగా అధిక సంఖ్యలో పశుపోషకులు పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ ఎస్‌ఐ జనార్దన్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ విజేతగా బాపట్ల

ఫైనల్‌లో విజయనగరంపై గెలుపు



క్రీడాకారులను అభినందిస్తున్న షూటింగ్ బాల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబురావు



విజేతలకు మెమొంటోలు అందిస్తున్న కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు

చీరాల రూరల్,చీమకుర్తి: అండర్–17 షూటింగ్ బాల్ విజేతగా బాపట్ల జిల్లా జట్టు నిలిచింది. గతేడాది డిసెంబర్ 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా పేర్నమిట్టలో రాష్ట్రస్థాయి అండర్–17 షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాష్ట్రంలోని 17 జిల్లాలకు చెందిన బాల, బాలికలు పాల్గొని తమ సత్తాచాటారు. ఈసందర్భంగా సోమవారం జిల్లా షూటింగ్ బాల్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ విస్తర్ల బాబురావు క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. బాపట్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటడం ఎంతో అభినందనీయమని, గర్వకారణమన్నారు. ఫైనల్‌లో విజయనగరం జిల్లా జట్టుపై 2–0 తేడాతో గెలిచి విజేతగా నిలిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందని చెప్పారు. ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు పూలమాలలువేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అంకితభావంతో బజరంగ్ ఫౌండేషన్ సేవలు



తక్కెళ్లపాడులో ప్రజల మధ్య 51 కిలోల కేక్ కట్ చేసి వృద్ధురాలికి తినిపిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

తక్కెళ్లపాడులో 695 మందికి కళ్లజోళ్లు పంపిణీ

పెదకాకాని: అంకిత భావంతో బజరంగ్ ఫౌండేషన్ సేవలను కొనసాగిస్తున్నట్టు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తూ, ప్రజా రంజకమైన పాలనను అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో తాము ప్రజాసేవలో ముందడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. బజరంగ్ జగన్నామ సంక్షేమంలో భాగంగా గత ఏడాది డిసెంబరు 27న మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో జరిగిన బజరంగ్ సంగమం కార్యక్రమంలో నేత్రజ్యోతిలో పాల్గొన్న గ్రామస్తులు 695 మందికి వ్యక్తిగత కళ్ళజోళ్ళు అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో సోమవారం అంబటి మురళీకృష్ణ గ్రామస్తులకు కళ్లజోళ్లు అందించారు. అనంతరం గ్రామ ప్రజల మధ్య 51 కిలోల కేక్ కట్ చేశారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలపై ప్రత్యేక శ్రద్ధ ఉందని, ఆయన స్ఫూర్తితోనే తామంతా ముందుకు సాగుతున్నట్టు స్పష్టం చేశారు.

నిర్ణీత వేళల్లో సమస్యలకు పరిష్కారం



ఫిర్యాది సమస్యను ఆలకిస్తున్న డీఎస్పీ ప్రకాష్‌బాబు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం జరిగింది. ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు డీఎస్పీలు శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), ప్రకాష్‌బాబు (క్రైం) బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి బాధలను ఆలకించారు. సబ్ డివిజన్ల పరిధిలోని పోలీస్ అధికారులతో వీసీ, మొబైల్‌ఫోన్ల ద్వారా మాట్లాడారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుల సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై www.c ybe-r-c-r-ime.g-o-v.i n ద్వారా నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో, టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

విజ్ఞాన్‌లో జాతీయస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైస్ చాన్స్‌లర్ నాగభూషణ్

చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలతో పాటు మహోత్సవ్–2కే 24లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ చాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో పాటు మొదటి నాలుగు స్థానాలు పొందిన జట్లకు రూ.50, రూ.30, రూ.20, రూ.10 వేలు నగదు బహుమతులను అందజేస్తామని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నూతన సంవత్సరంలో విద్యార్థులు కష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌ను కట్ చేశారు. క్రికెట్ చాంపియన్ షిప్‌లో భాగంగా మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను అందజేస్తామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ కార్యాలయంలో వేడుకలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర (2024) వేడుకలు జరిగాయి. ఈ మేరకు కేక్‌లను ఐజీ కట్ చేశారు. రేంజ్‌లోని ఎస్పీలు కె.ఆరిఫ్‌హఫీజ్ (గుంటూరు జిల్లా), వై.రవిశంకర్‌రెడ్డి (పల్నాడు జిల్లా), కె.తిరుమలేశ్వరరెడ్డి (ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా) పలు జిల్లాల ఏఎస్పీలు నిచికేత్‌షెల్కే, కె.సుప్రజ, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు రేంజ్ ఐజీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గుంటూరులో..

జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం జరగ్గా, ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ కేక్ కట్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమష్టిగా, సమర్థంగా నూతన సంవత్సరంలో నూతనోత్తేజంతో విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. తద్వారా జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. ఎస్పీని ఏఎస్పీలు నిచికేత్‌షెల్కే(తూర్పు సబ్ డివిజన్), కె.సుప్రజ (పరిపాలన), శ్రీనివాసరావు (ఎల్/ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి గజమాలతో సత్కరించారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంపై దాడి సిగ్గుచేటు : డొక్కా

నెహ్రూనగర్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని పార్టీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమవుతున్న సమయంలో ఆదివారం రాత్రి దుండగులు రాళ్ల దాడి చేయడం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. ఈ దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. దుండగులను సీసీ పుటేజ్ ద్వారా గుర్తించి అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పల్నాడు కలెక్టరేట్‌లో క్యాలెండర్ ఎగ్జిబిషన్

ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శివశంకర్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన తెలుగు, ఆంగ్ల క్యాలెండర్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రారంభించారు. క్యాలెండర్ చరిత్రతో 12 నెలల తెలుగు, ఆంగ్లంను ఉపయోగించి రూపొందించిన వివరాలతో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. తెలుగు పదాలైన చైత్రమాసం మొదలుకొని ఫాల్గుణం వరకు అన్ని నెలలను ఆంగ్ల మాసాలతో కలుపుతూ వివరాలతో రూపొందించిన క్యాలెండర్ అద్భుతంగా ఉందని కలెక్టర్ ప్రశంసించారు. ఆంగ్ల క్యాలెండర్ జూలియన్, హిందూ క్యాలెండర్ హిజ్రీ, ఇస్లామిక్, బౌద్ధ క్యాలెండర్, జపనీస్, చైనీస్, హిబ్రూ క్యాలెండర్ రూపొందించిన చిత్రాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. కలెక్టరేట్‌కు వచ్చిన పలువురు జిల్లా అధికారులు, సందర్శకులు ఎగ్జిబిషన్ ఆసక్తిగా తిలకించారు. పలువురు తమ తమ జీవితాల్లో ఏ నెల వస్తుందో చూసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, కలెక్టరేట్ ఏఓ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

నరసరావుపేట: జిల్లాలో గాలికుంటు వ్యాధి పకడ్బందీగా నివారించేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల రెండో తేదీ నుంచి జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమం కింద పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ సంచాలకులు కన్వీనర్‌గాను, నరసరావుపేట నియోజకవర్గ పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు, నియోజకవర్గ పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకులు సభ్యులుగా వ్యవహరించనున్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, పారా వెటర్నరీ సిబ్బంది, సచివాలయ పశు సంవర్ధక సహాయకులు విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్, గాలికుంటు టీకాలను ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి కాంతారావు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో న్యూఇయర్ వేడుకలు

నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యాలయంలోని అదనపు ఏఆర్ ఎస్పీ డి.రామచంద్రరాజు, శాంతిభద్రతల విభాగం అదనపు ఎస్పీ రాఘవేంద్ర, డీఎస్పీలు కె.పల్లపురాజు, బి.ఆదినారాయణ, కేవీ మహేష్, సీఐలు, ఎస్‌ఐలు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి సమక్షంలో ఎస్పీ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.